# భారతరాజధానిలో బామ్మగారి పాట్లు

## - చంద్రమౌళి -

అదుగో! అక్కడ ఆ పెట్టెలో ఉంది బామ్మ!" అంటూ అటు వైపు పరుగెత్తింది వత్సల. రమాపతిరావు ఆమె వెనకాలే డబాలీ బంట్రోతు పరుగెత్తినట్లు పరుగెత్తాడు.

ఎ. పి. ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫారం పక్కకి వేటగాడి విల్లులోంచి వూడిపడ్డ విల్లంబులా దూసుకొచ్చి హొప్పుతగా ఆగింది. స్వెట్టర్ ఇంకొంచెంకిందికి లాగుకుంటూ పరుగెడుతున్నాడు రమాపతిరావు. రైలు గంట లేటుగా వచ్చింది. లేడిలా గెంతుకుంటూ వత్సల వాళ్ళ బామ్మ కనిపించిన పెట్టె దగ్గరి కొచ్చి ఆగింది.

రైలు ఆగుతూనే అందరూ బిలబిలా దిగి వెళ్ళిపోయారు. వత్సల ముఖం కనిపించగనే బామ్మగారి ముఖం ఇంతయింది. ఆమె వెనకాలే ఉన్న కుర్రాడితో "ఇదుగో! నా అమ్మడు రానే వచ్చింది! అంది. వత్సల చెయ్యి ఆసరాగా మెల్లిగా ప్లాట్‌ఫారం మీదకు చేతి సంచితో దిగింది ఆమె. ఆ కుర్రా డెవరో తెలుగు కుర్రాడిలా ఉన్నాడు. ఆమె తాలూకు సామానులు ఒకటొక్కటి కిందకు దించబోతుంటే కూలీని కేకేసి, రమాపతిరావు "బామ్మగారూ! మీ చేతిలో సంచీ కూడా ఇవ్వండి వాడికి" అన్నాడు.

"ఏం బాబూ బాగున్నావా? ఎన్నాళ్ళయిందో అమ్మడినీ నిన్నూ చూసి", అంటూ సంచీ మాటుకు తన చేతిలోనే భద్రంగా పట్టుకుంది. ఆ సంచీకూడా ఇయ్యనీ బామ్మా!" అంటూ ఆమె చేతిలోంచి సంచీ తీసుకోబోయింది వత్సల.

"ఇవి నా మడి వస్తువులే తల్లీ! వాడి చేతి కిస్తే మైలపడిపోవూ?" అని గుడ్లురిమి చూసి కుంటుకుంటూ నడవటం మొదలెట్టింది.

ప్లాట్‌ఫారం మీద నుంచి స్టేషన్ నిష్క్రమణ ద్వారానికి బామ్మ గారికి అరగంట పట్టింది. ఇక ఇవాల్టికి ఆఫీసు ఖాళీ అనుకుంటూ రమాపతి టాక్సీవాడిని పిలిచాడు. టాక్సీలో కూడా బామ్మగారు తన మడి సంచీ అలాగే పట్టుకు కూర్చుంది.

ఇక్కడ ఇంత చలేస్తుందేమే అమ్మడూ? మన వూళ్ళో ఎండలు మండిపోతున్నై." అంటూ వెంట తెచ్చిన రగ్గులో కప్పుకు వణుకుతూ కూర్చుండిపోయింది బామ్మగారు. ఇంటికి వస్తూనే తన బామ్మకోసం మడిగా చేసిన వంట వివరాలూ అవీ చెబుతూ 'వేణ్ణీళ్ళు పెట్టిస్తా ముందు స్నానం చేద్దువుగాని" అన్నది వత్సల.

"ఎందుకే తల్లీ! ఈ బామ్మ జన్మలో ఎప్పుడైనా వేణ్ణీళ్ళు పోసుకుందా? నా కోసం మడిగా వంటకూడా చేశావా? నా తల్లే— అంటూ స్నానం చేయటానికి బాత్‌రూం లోకి వెళ్ళిన బామ్మగారు నిముషంలో గడగడ వణుకుతూ తిరుగు టపాలో తిరిగొచ్చేసింది. "ఏం బామ్మగారూ! చలేసిందా? ఈ వూరింతే సారూ. వేణ్ణీళ్ళు పెట్టించుకుని పోసుకోవలసింది" అంటూ చెప్పాడు రమాపతిరావు.

"అబ్బే! ఈ మాత్రం చలికే అంత ఇదవ్వాలా?" అని పళ్ళు బిగువున బిగించింది బామ్మగారు. రమాపతిరావుకు నవ్వు ముంచు కొచ్చినా అణచుకుని కూర్చున్నాడు.

"ఇక భోజనం చెయ్యి, బామ్మా!" అన్నది విజయ గర్వంతో వత్సల.

"అబ్బే! ఇప్పుడు భోజనమేమిటే, నా తల్లీ! అదుగో—ఆ సంచీలో అరటిపళ్ళున్నై. నాలుగు నా ముఖాన పడేయ్!" అన్నది బామ్మగారు.

"అదేమిటి, బామ్మగారూ! మీ మనమరాలు మీ కోసం తెల్లవారుఝామునే లేచి మడి కట్టుకుని వస రసాలతో వంట చేస్తే మీరు పళ్ళతో పొట్ట నింపు కుంటే ఎలా?" అన్నాడు వోరగా భార్యవంక చూస్తూ రమాపతి.

"దాని ముఖం. చిన్న పన్నాసి! దానికి మడంటూ తెలిసేడిస్తేనా? ఇంతకూ నా మీద ప్రేమకొద్దీ..." బోసినవ్వు నవ్వింది బామ్మగారు. రమాపతి రావు భార్య వంక వోరగా ముసిముసి నవ్వులు నవ్వుతూ చూస్తుంటే వత్సల కసిగా బామ్మగారి సంచీలో నుంచి అరటిపళ్ళ గుత్తి తీసి ఆమె ముందు పడేసింది.

"మీ బామ్మగారికి చలి వేస్తున్నట్లుందోయ్!" అన్నాడు రమాపతి.

"అబ్బే! ఆమె ఋషిలాంటిదండీ—ఆమెకు చలి వేయదు" అన్నది వత్సల.

"అవును! అందుకనే అర్థరాత్రి పూట భజన చేస్తున్నది. లేచి ఆ సంగతేమిటో కనుక్కో! లేక పోతే ఇరుగు పొరుగు వాళ్ళు వచ్చి గొడవ చేస్తారు" అన్నాడు రమాపతి.

ముందుగదిలోంచి రామ నామ తారకం జోరుగా వినిపించసాగింది. వత్సల కళ్ళు నులుముకుంటూ లేచి, రగ్గు కప్పుకుని చెప్పులేసుకుని వెళ్ళి ముందు గది తలుపు తట్టి "బామ్మా! బామ్మా!" అంటూ కేకలేసింది. ఆ పిలుపుకు నిజంగా రాముడవారే వచ్చి తలుపు కొట్టినట్లు టక్కున తలుపు తీసింది బామ్మ గారు. వత్సల లోపలికి అడుగు పెడుతూ లైటు వేసింది. చలికి గజగజ వణుకుతున్నా పైకి నవ్వు తెచ్చుకుని "ఏమిటే, పిచ్చి తల్లీ!" అన్నది.

* * *

"నీ కేమైనా మతి పోయిందిటే, అమ్మడూ! ఇన్నేళ్ళు వచ్చి చదువుకోక మట్టికొట్టుకోనా అన్నట్లు ఇప్పుడు నాకు చొక్కాలు కుట్టిస్తావా? చొక్కాలు..." అని విసుక్కుపడింది బామ్మ.

"నా మాట విను బామ్మా! ఇది గుంటూరో, విజయవాడో కాదు. ఇక్కడ ఒక్క చొక్కా కాదు, రెండు వేసుకుని స్వెట్టర్లు వేసుకుంటే గాని చలి ఆగదు. ఆపైన రజాయికూడా కప్పాలి" అని ప్రాధేయపడింది వత్సల. ససేమిరా అన్నది బామ్మ గారు. నీ కర్మ నీవే అనుభవిస్తావులే అన్నట్లు చూసి వూరుకుంది వత్సల.

అర్ధరాత్రి అయినా మగతూ పరాకా లాడే వేళ ముందు గదిలోనుంచి 'రామ నామ తారకం' వినపడటంతో లేచి కూర్చున్నాడు రమాపతిరావు. భజన రామ రామ ఉద్ధృతం కావటంతో భార్యను లేపి కూర్చోబెట్టాడు కూడా. 'ఏమిటండీ!' అంటూ లేచి కూర్చుంది వత్సల.

"నిద్రపట్టడం లేదా బామ్మా!" అన్నది వత్సల.

"కొత్తచోటుగదే, తల్లీ!" అని అంగలార్చింది బామ్మగారు.

"మొహమాటపడకు బామ్మా! ఈ రగ్గు కూడా, కప్పుకో" అంటూ తమ గదిలోనుంచి రూము హీటరు తీసుకొచ్చి స్విచ్ వేసి "ఇక పడుకో"అంటూ వచ్చేసింది వత్సల.

* * *

"ఇదుగో,బాబూ! ఎక్కడైనా సంగీతం కనిపిస్తే దేవా కాస్త పిలుస్తావా?" అన్నది ఆదివారంనాడు బామ్మగారు. ఆదివారం నాడు ఎక్కడికైనా కదలట మంటే రమాపతికి బ్రహ్మ ప్రళయం. భార్యామణి బామ్మగారు స్వయానా పురమాయించటంతో ఇకతప్ప లేదు. భార్య పనిచేసుకోలేక బామ్మగారిని తీసుకొచ్చు కుంది. తప్పలేదు రమాపతికి. ఆకు చెప్పులేసుకుని చుట్టుపక్కల నాలుగువీధుల్లా చూసొచ్చాడు రమా పతిరావు. ఎక్కడా సంగీతం చేసేవాడు కనపడలేదు ఇలాంటి సమస్యఅంటూ ఒకటుంటుందని అనుకోనెప్పుడూ

అనుకోలేదు. విరాళ చేసుకొని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి తిరిగి వచ్చాడు రఘుపతిరావు.

అతని రాకకోసం వెయ్యి కళ్ళతో చూస్తున్న బామ్మగారు "అమ్మడూ! ఒక గిన్నెతో కాచిన నీళ్ళు పట్రావే" అని అరిచింది, అక్కడికి రఘుపతిరావు మంగలిని తీసుకొచ్చినట్లు.

"అబ్బే! ఎక్కడా కనపడలేదండీ" అన్నాడు నీళ్ళు కారిపోతూ.

"ఇంత మహాపట్నంలో మంగలి దొరక్కపోవట మేమిటి, నాయనా!" అంటూ విస్తుపోయింది బామ్మగారు.

"మంగలి దొరక్కపోవటం కాదు బామ్మా! ఇంటికి రారు ఈ వూళ్లో! మనమే షాపుకు వెళ్ళాలి."

"ఏమి విచిత్రమే! పరాచికాలాడటానికైనా వయసూ వాయా ఉండొద్దుటే! నాతోనా పరాచి కాలా! ఈ ముసలిముండను షోగ్గా షాపుకుపోయి మంగలి పని చేయించుకోమంటావా?" అని విరుచుకు పడింది బామ్మగారు.

"అధైర్యపడకండి బామ్మగారూ! మళ్ళాసాయంత్రం ప్రయత్నిస్తాను" అన్నాడు రఘుపతిరావు.

"అదేమిటి. నాయనా! సాయంత్రం పూట ఎవరైనా క్షురకర్మ చేయించుకుంటారా!" వసిగింది బామ్మగారు.

బామ్మగారిని సంతోషపెట్టటానికి రఘుపతిరావు ఎంత ప్రయత్నించినా, ఎక్కడా ఇంటికి వస్తానన్న వాడుగా బ్రాహ్మణుడు కనబడనే లేదు.

బామ్మగారికి ముళ్ళమీద వున్నట్లుంది. ఆ రోజు ఉదయానే రఘుపతిరావు ఆఫీసుకు వెళ్ళిపోగానే "అమ్మడూ!" అంటూ మెల్లగా పిలిచింది. వత్సల వచ్చి బామ్మగారి దగ్గర కూర్చుంది. ఆమె తలమీద చెయ్యి వేసి మెల్లిగా రాస్తూ "చూడు! మీ ఆయన గడ్డం చేసుకుంటాడే అది పట్రా!" అన్నది. వత్సల అర్థం కానట్లు ఆమె వంక చూసింది.

"ఏమీలేదు! మంగలి దొరికి చావటంలేదు! నేనే చేసుకుంటాను" అన్నది వత్సలకు ఏడవాలో నవ్వాలో తెలీలేదు! "నీ సామాను ఎవర్నీ కానుక్కుంటానంటే బామ్మా! తొందరపడకు."

"ఇంకా నయం— ఎవరైనా చూస్తే!"

"ఈ వూళ్లో ఎవరి సంగతీ ఇంకొకళ్ళకు పట్టదు, బామ్మా! అసలు ఇటుపక్క విధవలు జుట్టే తీయించుకోరు."

"వాళ్ళ కర్మ వాళ్ళది! పచ్చి ఎక్కడున్నాడో ఆ మహారాజు—ఆయన ఆత్మ ఇప్పటికీ క్షోభిస్తూ ఉండాలి."

"పోనీ, ఆడవాళ్ళకు క్షౌరశాల వేరుగా ఉంటుంది— అక్కడికి తీసుకువెళ్ళనా?"

"అయ్యాయ్! నా బాధ వదలకపోతే రైలెక్కించేయ్! పోయి అక్కడే పడ్డుంటాను" అని విరుచుకు పడింది బామ్మగారు.


"అది కాదే!"

"ముందు ఆ గడ్డంగీసుకునేది తెస్తావా? లేదా?" హుంకరించింది బామ్మగారు.

రఘుపతి ఏమంటాడో నని బెరుకుగా ఉన్నా, వత్సల బామ్మ ధాటికి తట్టుకోలేక అతని రేజరులో కొత్త బ్లేడు వేసి, ప్లాస్టిక్ మగ్గుతో నీళ్ళు పోసి తీసు

కొచ్చి బామ్మగారి ముందు పెట్టింది. పీటమీద బాసింపట్లు వేసుకుని కూర్చుని, ముందు అద్దంపెట్టి ఎంతో అనుభవం ఉన్న దానిలా రేజరు పట్టుకుని ఉపక్రమించింది బామ్మగారు. అంత దగ్గరగా కూర్చుని చూస్తున్నది వత్సల.

క్షణంలో పెద్ద గావుకేక పెట్టింది బామ్మగారు. వత్సల ఉలిక్కిపడి చూస్తే బామ్మగారి తలమీద కాసంత గాటులో నుంచి నెత్తురు చిమ్మింది. "అయ్యో!" అంటూ నిబాసల్ఫ్ పౌడరు అద్ది దూదిపెట్టి "డాక్టరు దగ్గరికి పోదాం, బామ్మా!" అంది.



బామ్మగారు కిక్కురుమనకుండా బయలుదేరింది.

"ఏమ లేమైంది" అని అడిగాడు డాక్టరు ఆశ్చర్యంగా చూస్తూ. అసలు సంగతి చెప్పకుండా, పైనుంచి కత్తి పడిందని అబద్ధం చెప్పి కట్టు కట్టించి ఇంటికి తీసుకొచ్చింది వత్సల. వస్తున్నా బామ్మ మొండిగా చేసిన పనికి ఆమెకు చాలా కోపం వచ్చింది

• • •

"ఇక నేనీ వూళ్లో ఉండలేనమ్మా! మీ ఆయన్ను నా కొక టిక్కెట్టు కొనుక్కొచ్చి పెట్టమను" అంది బామ్మగారు.

"అదేమిటి, బామ్మా! నువ్వొచ్చి పది రోజులైనా కాలేదు. అప్పుడే వెళ్ళిపోవడ మేమిటి?" అన్నది వత్సల.

"ఏమోనమ్మా! ఈ వూళ్లో ఈ భాష తెలీదు నాకు. అసలు తోచి చావటం లేదు— ఒక కాలక్షేపం లేదు, కాకరకాయ లేదు."

"ఇంతదూరం ఎలాగూ వచ్చావు. అటు హరిద్వారం, ఇటు కాశీ వెళ్ళి వచ్చాక వెళ్దువుగాని" అని నచ్చచెప్పబోయింది వత్సల.

"కాశీ వద్దు నా పాడూ వద్దు. మీ ఆయనతో చెప్పి ఎలాగో అలా నన్ను రైలెక్కించే మార్గం చూడు తల్లి" అని ప్రాధేయ పడింది బామ్మగారు.

బామ్మగారు వచ్చినంత హఠాత్తుగా వెళ్ళిపోతాననటంతో బిత్తరపోయింది రఘుపతిరావుకి కూడా. అతను కూడా చెప్పి చూచాడు. అయినా బామ్మగారి మనసు మారలేదు.

ఎంతో ప్రయత్నం చేస్తేగాని టిక్కెట్టు వెంటనే దొరకలేదు. రైలెక్కి కిటికీలోంచి చూస్తూ, "చూడు, నాయనా! దేశంగాని దేశంలో ఏముంటావు? ప్రయత్నించి మన దేశం వచ్చేయండి" అని సలహా ఇచ్చింది. రైలు బయలుదేరగానే అప్పటిదాకా ముడుచుకు పోయిన ఆమె ముఖం దివిటిలా వెలిగింది. *